క్లుప్తంగా

శ్రీరాముని అక్షింతలు ఇంటింటా పంపిణీ



గాలాయగూడెంలో శ్రీరాముని అక్షింతలు ఇంటింటా పంపిణీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని అక్షింతలు శనివారం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ కమిటీ బాధ్యులు పంపిణీ చేశారు. ట్రాక్టర్‌పై సీతారామ, లక్ష్మణ విగ్రహాలను ఉంచి వారి వద్ద ఉంచిన 80 కేజీల అక్షింతలను గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆలయ కమిటీ సభ్యుడు అంబటి లక్ష్మణరావు, గంటా సుబ్బారావు, పెద్దిశెట్టి బసవయ్య, పెద్దిశెట్టి నాని, ఏనుగు రామకృష్ణ, పూజారి రాంబాబు, పూజారి శ్రీనివాసరావు అందజేశారు. శ్రీరాముని అక్షింతలను తీసుకువచ్చి గ్రామంలో ఇంటింటా పంపిణీ చేసిన అచ్చమ్మ తల్లి ఆలయ కమిటీని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అభినందించారు.

అండర్ పాస్‌లో నీరు.. ప్రయాణికుల ఇక్కట్లు



దెందులూరు అండర్‌పాస్‌లోకి చేరిన నీరు

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం మధ్య రైల్వే ట్రాక్ దిగువన అండర్‌పాస్‌లో నీళ్లు కొన్ని నెలలుగా తొలగించకపోవడంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అండర్‌పాస్ నీళ్లల్లో దిగి నడవలేక ట్రాక్‌పై నుంచి వెళితే జరిగే ప్రమాదాలను ఊహించుకుని ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు పరిశీలించి కాంట్రాక్టర్‌తో అండర్‌పాస్‌లో ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాయామ కళాశాలలో స్వచ్ఛభారత్



గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు ఆధ్వర్యంలో డీపీఈడీ, ఈయూజీడీ విద్యార్థులు 10 ఏళ్లుగా కళాశాల లైబ్రరీ అపరిశుభ్రంగా ఉండటం, అనవసరమైన కాగితాలు, ఫర్నీచర్‌తో గ్రంథాలయ రూపురేఖలు అధ్వానంగా ఉండటంతో గ్రంథాలయం, కళాశాలలో డ్రైనేజీ, ప్రిన్సిపల్, క్లాస్‌రూమ్స్, క్లాక్ రూమ్స్‌ను శుభ్రం చేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



శ్రీరామవరంలో ఆరోగ్య శ్రీ కార్డులను అందజేస్తున్న కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య, భద్రత కోసం ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 25 లక్షల పరిధి పెంచిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరి గుండెల్లో ఎప్పుడూ కొలువై ఉంటారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం శ్రీరామవరంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కనుమూరి సావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ళ సత్యనారాయణ, వార్డు మెంబర్లతో కలిసి ఆయన గ్రామ ప్రజలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఐద్వా 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతి ప్రియ శనివారం ఆవిష్కరించారు. స్థానిక పవరుపేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో క్రాంతిప్రియ మాట్లాడుతూ నిత్యం మహిళల సమస్యలపై పోరాడుతోన్న ఐద్వా సేవలు అభినందనీయమన్నారు. మహిళల సమస్యలపై చేస్తున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఐద్వా కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగించాలని ఆమె సూచించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. రామలక్ష్మి, విజయ, ఉదయ కుమారి, కళ్యాణి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షపాతి

- గోపినాథపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గోపినాథపట్నంలో ప్రజలకు అభివాదం చేసి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: సీఎం జగన్‌మోహనరెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఉంగుటూరు మండలం గోపినాథపట్నం కొట్టు వెంకటేశ్వరరావు, సరస్వతీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వాసుబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ విజయవాడ మధ్యలో దేశంలో ఎక్కడా లేని విధంగా 206 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠించి జాతి మొత్తం గర్వించేలా చేశారని అన్నారు. ఇంత పెద్ద విగ్రహం దేశంలో మరెక్కడాలేదన్నారు. దళిత, పేద వర్గాల గుండెల్లో పనిని జగన్ చేశారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవస్థలలో మార్పు తీసుకురావడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్టు తెలిపారు. సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పాలనను దగ్గర చేశారని అన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమం అందేలా చేసిన మహనీయుడు జగన్ అని అన్నారు. వ్యవసాయదార్లకు సేవలందించేలా గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని నెలకొల్పినట్టు పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో మార్పులు, వైద్య రంగంలో మార్పులు పేదల అభ్యున్నతి కోసమేనని వాసుబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నార్ని త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పుత్సకాయల సూర్యభగవాన్, గంటాలక్ష్మణరావు, దొండపాటి శేఖర్, చేకూరి నాగబాబు, ఉపసర్పంచి మన్నే యన్నమని యామిని, గొల్లగూడెం, తిమ్మయ్యపాలెం, చేబ్రోలు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

పెదపాడు: పెదపాడు మండలం వట్లూరులోని క్రాంతి కల్యాణ మండపంలో ఏలూరు పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. పెదపాడు మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

22న రామాలయం వద్ద జ్యోతి ప్రజ్వలన

దెందులూరు: గోపన్నపాలెం సెంటర్ రామాలయం వద్ద ఈ నెల 22న జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్టు రామాలయం కమిటీ తెలిపింది. 22న అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ సందర్భంగా ఉదయం 8 గంటలకు అఖండ జ్యోతి వెలిగిస్తారని గోపన్నపాలెంతో పాటు సమీప గ్రామాల్లోని భక్తులు పాల్గొని శ్రీరాముని ఆశీస్సులు పొందాలని కోరారు.

క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషి





భీమడోలులో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న తుమ్మగుంట రంగ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన దెందులూరు క్రికెట్ జట్టు



భీమడోలులో మండల స్థాయి పోటీలో సత్తాచాటుతున్న భీమడోలు 2 పురుషుల జట్టు



భీమడోలులో మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచిన పూళ్ల-2 జట్టు

భీమడోలు: క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఉంగుటూరు నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు ముగిసిన నేపథ్యంలో విజేతలకు క్రికెట్ కిట్లు, క్రీడా దుస్తులను పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మగుంట రంగ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గత నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో యువ క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. యువత క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన యువతకు ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ క్రీడా స్ఫూర్తిని చాటారని అన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ మండలంలో వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో మండల స్థాయి విజేతలంతా ఈనెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలకు హాజరు కావాలని, వారంతా సత్తా చాటి మండలానికి గుర్తింపు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు, పంచాయతీ నిర్వాహక కార్యదర్శులు సూర్య, వెంకట్రావు, కె.వెంకట్రావు, పీడీలు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ఘనంగా ముగిసాయి. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా 29 టీములు పాల్గొన్నాయి. ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో పోటీలు కొనసాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో వివిధ టీముల క్రీడాకారులు హోరాహోరీగా పోరాడారు. భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆధ్వర్యంలో మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల పీడీల సహకారంతో పోటీలు నిర్వహించగా క్రీడాకారులంతా ఉల్లాసంగా ఆడి క్రీడాస్ఫూర్తిని చాటారు. పురుషుల డబుల్స్ పోటీల్లో భీమడోలు-2 జట్టు, మహిళల విభాగంలో పూళ్ల-2 జట్టు ప్రతిభ కనబర్చారు. విజేతలను ఎంపీడీవో, మండల కోఆర్డినేటర్ అభినందించారు. ఈనెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు కృష్ణారావు, ప్రసాద్, రాహుల్, శేఖర్, ప్రమీలా, సాయిలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు దెందులూరు జట్టు ఎంపిక

దెందులూరు: దెందులూరు క్రికెట్ జట్టు దెందులూరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైందని ఎంపీడీఓ శ్రీలత, మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ అన్నారు. శనివారం దెందులూ రు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కొవ్వలి క్రికెట్ జట్టుపై దెందులూరు క్రికెట్ జట్టు విజ యం సాధించింది. విజేత జట్టుకు ఏఓ భీమరాజు, హెచ్‌ఎం శర్మ, ఈపీడీ రాధ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి క్రీడాసామగ్రి కిట్‌ను అందజేశారు.

జోరుగా కుల గణన సర్వే



దళితపేటలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ కార్యదర్శి ఎం. విజయలక్ష్మి

దెందులూరు: కుల గణన సర్వే కార్యక్రమం గ్రామాల్లో జోరుగా కొనసాగుతోంది. శనివా రం దెందులూరులోని పెద దళితపేటలో కుల గణన నిర్వహిస్తున్నారు. సచివాలయం–3 గ్రామ కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, వలంటీర్ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సర్వే అంశాల జవాబులను ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకుని నమోదు చేస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను గ్రామ పంచాయతీ కార్యదర్శి వీఎస్ చౌదరి పర్యవేక్షించారు.

విస్తృతంగా కుల గణన

పెదపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో కులగణన సర్వే విస్తృతంగా చేపట్టినట్లు పెదపాడు ఎంపీడీవో జే తేజ రతన్ తెలిపారు. కుల గణనలో పని చేస్తున్న సిబ్బందికి సర్వే పూర్తయ్యేంత వరకు ఎలాంటి సెలవులు లేవన్నారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామాల్లో డస్ట్‌బిన్ల పంపిణీ

ఏలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.14 లక్షల విలువైన 20 వేల ప్లాస్టిక్ డస్ట్‌బిన్స్ సరఫరా చేసినట్టు ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి తెలిపారు. శనివారం ఉదయం ఏలూరు మండల పరిషత్ కార్యాలయానికి వ్యాన్‌లో తీసుకొచ్చిన డస్ట్‌బిన్స్‌ను గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా సరళకుమారి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ నీలం, పచ్చ రంగు డస్ట్‌బిన్లు రెండు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్త వేరుచేసి డస్ట్‌బిన్స్‌లో నింపి పారిశుధ్యం సిబ్బందికి అందించాలని కోరారు. తడిచెత్తతో కంపోస్ట్ తయారు చేస్తారని, పొడి చెత్తతో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ మరింత సులువు అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ రీసైకిలింగ్‌కు పొడి చెత్త ఉపయోగపడుతుందన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



దెందులూరులో నిర్మించిన డ్రెయిన్లు, రోడ్లను పరిశీలిస్తున్న కొఠారు రామచంద్రరావు

దెందులూరు: బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు గంటా ప్రసాదరావు అన్నారు. శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా మేరిరాజు, వార్డు మెంబర్ రాజేష్ నివాసానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇటీవల నూతనంగా నిర్మించిన రైతు భరోసా, సచివాలయం, డ్రెయిన్లు, రోడ్లను దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, గంటా ప్రసాదరావుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ కమిటీ సభ్యులు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, నాయకులు తొత్తడి కృష్ణ, ఐనంపూడి రాము, మొటపర్తి రాంబాబు ఉన్నారు.

అచ్చమ్మ తల్లి ఆలయాభివృద్ధికి రూ.25 లక్షల విరాళం



ఆలయం వద్ద రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు రూ. 25 లక్షలు విరాళం ఇచ్చారు. రూ. 25 లక్షలతో వీఆర్వో విష్ణు ఇంటి వద్ద నుంచి అమ్మవారి ఆలయం వరకు అర కిలోమీటరు మేర రూ. 25 లక్షలతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. శనివారం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి భక్తుల సౌకర్యానికి ఇప్పటి వరకు గంటా దంపతులు రూ. 50 లక్షలకుపైగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారన్నారు. మరోసారి వారి సహాయంతో రూ. 25 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. అనంతరం దాతలను సర్పంచ్ ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

సేంద్రియ సాగు విధానం పరిశీలన

- అమ్మపాలెంలో బంగ్లాదేశ్ బృందం పర్యటన



ప్రకృతి సాగులో సేంద్రియ రసాయనాల ఉపయోగాలను వివరిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ

పెదవేగి : ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని అమ్మపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి బంగ్లాదేశ్ బృందం శనివారం గ్రామంలో పర్యటించడం ఎంతో ఆనందదాయకమని వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవేగి మండలంలో ప్రకృతి వ్యవసాయం విధి విధానాలను పరిశీలించి, ఇదే తరహాలో పంటలను పండించేందుకు అధ్యయనం చేయడానికి బంగ్లాదేశ్ బృందం అమ్మపాలెంలో పర్యటించింది. పండిస్తున్న పంటలు, ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆ బృందానికి స్థానిక రైతులు వివరించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం, ప్రకృతి వ్యవసాయం డీపీఎం బి తాతారావు, వ్యవసాయ శాఖ అధికారి ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పుంతలో ముసలమ్మ జాతర

నిడమర్రు: నిడమర్రు మండలం బావాయిపాలెంలోని పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవా లు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవా లు ఈనెల 22వ తేదీ వరకూ కొనసాగుతాయని ఆలయ ట్రస్టీ ముత్యాల పెదబాబు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, దేవతామూర్తుల రూపాల్లో అలంకరించారు. గణపవరం, బువ్వనపల్లి, సరిపల్లె, బావాయిపాలెం, క్రొవ్విడి, పెద కాపవరం, చినకాపవరం, సిద్ధాపురం, చానమిల్లి, ఎనికేపల్లి, అడవికొలను, నిడమర్రు తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్ర, శనివారాల్లో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. 22వ తేదీ సోమవారం అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పెదబాబు తెలిపారు.

సమాజాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు దోహదం



ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న కాన్పూర్ ఐఐటీ శాస్త్రవేత్త శ్రీనివాసరావు

ఉంగుటూరు: ప్రజలకు ఉపయోగపడేలా శాస్త్రవేత్తలు, విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని, అవి సమాజాభివృద్ధికి దోహదం చేస్తాయని కాన్పూరు ఐఐటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఊసా చిరంజీవి శ్రీనివాస్ అన్నారు. శనివారం నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రో కెమికల్ డివైజస్ ఫర్ బయో మెడికల్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం సెమినార్ హాల్లో అందించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శాస్త్రవేత్త శ్రీనివాసరావు మాట్లాడుతూ అవరోధాలు నూతన ఆవిష్కరణలకు మార్గం వేస్తాయన్నారు. ఆవిష్కరణ అనేది మన జీవన విధానంలో ఒక భాగమని అన్నారు. ప్రతి వ్యక్తి తన అవసరానికి కొత్త మార్గాలను అనుసరిస్తూ ఉంటాడని అన్నారు. ఎలక్ట్రో కెమికల్ డివైజెస్, బయో మెడికల్ ఆవిష్కరణలలో వివిధ రకాలు వస్తువులు పనితీరును విద్యార్థులకు వివరించారు. ఆయన ఆవిష్కరించిన చెమటతో మధుమేహ పరీక్షలు చేసే పరిశోధనకు కారణం ఒక నాలుగేళ్ల పాప అని వివరించారు. మధుమేహ వ్యాధితో బాధపడుతూ పరీక్షల నిమిత్తం ఇంజక్షన్ సూదితో రక్తం తీసినప్పుడు ఆ పాప ఏడుపు తన మనసును కలచి వేసిందన్నారు. బిడ్డ బాధను చూసి తండ్రి మనస్సు విలవిల్లాడిపోయింది. అదిచూసి పరిష్కార మార్గాలను ఆలోచించి పరిశోధన చేసినట్టు తెలిపారు. చెమటతో సుగరు పరీక్షలు చేసే ఆవిష్కరణలో విజయం సాధించినట్టు శ్రీనివాసరావు వివరించారు. ఈ పరిశోధనకు పేటెంట్ హక్కు భారత ప్రభుత్వం ఇవ్వడం ఓ మైలురాయి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో, కళాశాలల్లో చదివే విద్యార్థులు ఎవరికీ తక్కువ కాదనేది నా ప్రగాఢ నమ్మకమని అన్నారు. దీనికి తను సాధించిన విజయమే తార్కాణంగా అభివర్ణించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ఫలితాలతో నేటి మానవుడు సుఖవంతంగా జీవించగలుగుతున్నాడని వివరించారు. శాస్త్రవేత్త శ్రీనివాసరావును అధ్యాపకులు విద్యార్థులు సత్కరించారు. సమావేశంలో డాక్టర్ కొండా రవి, రెడ్డయ్య డాక్టర్ పి బాబూరావు, బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.